# 6 అర్హులందరికీ.. గ్యారంటీలు

ఎలాంటి పైరవీలకు తావులేవు

## త్వరలోనే గైడ్ లైన్స్ విడుదల చేస్తాం



అబ్దుల్లాపూర్ మెట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

- లబ్ధిదారులను గుర్తించేందుకే ప్రజా పాలన కార్యక్రమం
- ప్రజాపాలనకు సంబంధించి త్వరలోనే గైడ్ లైన్స్ విడుదల చేస్తాం
- అధికారులను అడిగి అనుమానాలను నివృత్తి చేసుకోండి
- ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు
- పార్టీలకు అతీతంగా ప్రజలకు న్యాయం జరగాలి : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- బీసీ, మైనార్టీ బంధు కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేయాలి
- గృహలక్ష్మి పథకం కింద 3వేల మందికి మూడు లక్షలు మంజూరు చేశాం
- ఎన్నికల నోటిఫికేషన్‌తో నిలిచిపోయాయి.. కలెక్టర్ల వద్ద చెక్కులున్నవి
- మరో రెండు లక్షలు కలిపి ఐదు లక్షలు ఇవ్వండి
- మంత్రి పొన్నంను కోరిన ఎమ్మెల్యే దానం నాగేందర్



బంజారాహిల్స్ వార్డ్ ఆఫీసు వద్ద ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్

సిటీబ్యూరో, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ) : ప్రజా పాలన కార్యక్రమంలో ఎలాంటి పైరవీలు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని, 6 గ్యారంటీలకు సంబంధించి త్వరలోనే గైడ్ లైన్స్ విడుదల చేస్తామని చెప్పారు. బుధవారం బంజారాహిల్స్ వార్డ్ ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమాన్ని మేయర్ గద్వాల్ విజయలక్ష్మీతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అదేవిధంగా రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌లతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ అభయ హస్తంలో భాగంగా వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అనుమానాలు, సందేహాలు ఉన్నా అధికారులను అడగాలని, ఎటువంటి ఆధారాలు లేకున్నా దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి అన్నారు. కొత్త రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పదేళ్ల తర్వాత అధికారం ఇచ్చారని, ఇచ్చిన హామీలను అమలు చేయుటకు ప్రజల వద్దకు పాలన పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హతను బట్టి లబ్ధి చేకూరుతుందని, ఎలాంటి పైరవీలకు తావు లేదని, ఆరు గ్యారంటీలతో పాటు మిగతా సమస్యలపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని మంత్రి చెప్పారు. హైదరాబాద్ నగరంలో 150వార్డులకు గాను వార్డుకు నాలుగు లొకేషన్లలో మొత్తం 600 కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం ఆదర్శంగా ఉండేలా కార్యక్రమం నిర్వహించాలని అధికారులను కోరారు. ప్రజా స్వామ్యంలో అధికారం మారడం సహజమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కౌంటర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రే, కాలుష్య నివారణ నియంత్రణ బోర్డు మెంబర్ సెక్రెటరీ కృష్ణ ఆదిత్య, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్ఈ రత్నాకర్, ఈఈ విజయ సాయి రెడ్డి, ఏ ఏం ఆండ్ హెచ్ఓ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వానికి జీహెచ్ఎంసీ సహకారం ఉంటుంది : మేయర్

జీహెచ్ఎంసీ నుంచి కొత్త ప్రభుత్వానికి అన్ని విషయాలలో పూర్తి సహకారం ఉంటుందని, ప్రజా పాలన మంచి కార్యక్రమం అయినందున పార్టీలకు అతీతంగా ప్రజలకు న్యాయం జరగాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. అనుమానాలను నివృత్తి చేస్తూ ప్రజల్లోకి వెళ్లాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి దరఖాస్తుకు రేషన్ కార్డు ముఖ్యం కాబట్టి రేషన్ కార్డుల జారీపై త్వరగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కార్పొరేటర్ విజయారెడ్డి కోరారు. ప్రజాపాలన కార్యక్రమంలో అందరూ భాగస్వాములై సహకరించాలన్నారు.

### గృహలక్ష్మి ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందించాలి : ఎమ్మెల్యే దానం

ఆరు గ్యారంటీల అమలును 100 రోజుల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద నియోజకవర్గానికి 3వేల మందికి మూడు లక్షలు చొప్పున మంజూరు చేసిందని, ఎలక్షన్ కోడ్ ఉన్నందున లబ్ధిదారులకు చెక్కులను అందించలేకపోయామని, ప్రస్తుత ప్రభుత్వం అభయ హస్తం కింద మరో రెండు లక్షలు అదనంగా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన మంత్రి పొన్నంను కోరారు. బీసీ, మైనార్టీ బంధు కింద మంజూరైన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, ఆ చెక్కులు జిల్లా కలెక్టర్ వద్ద ఉన్నాయన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున పంపిణీ చేయలేక పోయినట్లు వాటిని కూడా లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో 1500 స్లమ్స్‌లను పరిగణలోకి తీసుకోవాలన్నారు.

## మ్యానిఫెస్టోను తప్పనిసరిగా అమలు చేస్తాం:మంత్రి శ్రీధర్ బాబు



రాజేంద్రనగర్ వార్డు కార్యాలయం వద్ద అధికారులతో కలిసి ప్రజలకు ప్రజాపాలన గురించి వివరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

బండ్లగూడ, డిసెంబర్ 28: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గురువారం రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌లతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 6 గ్యారంటీలకు సంబంధించి త్వరలో గైడ్‌లైన్స్ విడుదల చేస్తామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, ఎమ్మెల్సీ రహమత్ బేగ్, బీజేపీ నాయకులు వై.శ్రీధర్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు నింపడంలో సహకరించండి

అధికారులకు సూచించిన హరిచందన



పీర్జాదిగూడలో లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీస్తున్న రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ హరిచందన, మేయర్ వెంకట్‌రెడ్డి, అధికారులు

పీర్జాదిగూడ, డిసెంబర్ 28 : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కేంద్రాలను గురువారం రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ హరిచందన దాసరి, స్థానిక మేయర్ జక్క వెంకట్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాలకు వచ్చిన లబ్ధిదారులను ఏఏ పథకాలకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. కేంద్రాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని తెలుసుకోవడంతో పాటు లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీలను ప్రతి లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు పథకాల పట్ల అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తులు నింపడంలో సహకరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ జాన్ సాంసన్, చైర్మన్‌లు ముల్లి పావనీజంగయ్య యాదవ్, బి.కొండల్‌రెడ్డి, కార్పొరేటర్లు సుభాష్ నాయక్, బండారి మంజుల రవీందర్, ఏసీపీ శ్రీనివాస్, నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే రసీదు ఇవ్వాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గౌతమ్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 28 : ప్రజల నుంచి ప్రతి దరఖాస్తును స్వీకరించి, వారికి రసీదు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. గురువారం మొదటి రోజు దరఖాస్తుల స్వీకరణను ఆయన పరిశీలించారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని 14వ వార్డు ఇంద్రారెడ్డి కాలనీ, మండల పరిధిలోని నర్కూడ గ్రామంలోని సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించి, వారికి రసీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వచ్చేనెల 6వ తేదీ వరకు ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణను విజయవంతం చేయడం కోసం రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ నాగమణి, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుష్మారెడ్డి, సర్పంచ్ సిద్దు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రారెడ్డి కాలనీలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్, తదితరులు

## మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

మేడ్చల్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభమైంది. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారంలో జిల్లా జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది.